***RELEASED FROM***
***CPI(M) state office***
H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202
E-mail: cpimap@gmail.com

# - వామపక్ష పార్టీలు

విజయవాడ,
**తేది : 16 జూలై, 2017.**

**శ్రీయుత నారా చంద్రబాబునాయుడు గారికి**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము,
అమరావతి.

ఆర్యా!

**విషయం : గరగపర్రు దళితులపై సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలని, దేవరపల్లి దళితులను సాగు నుండి తొలగించవలదని కోరుతూ....**

పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం గరగపర్రు గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్న కక్ష్యతో భూస్వాములు, పెత్తందార్లు దళితులపై సుమారు గత మూడు నెలలుగా సాంఘిక బహిష్కరణ కొనసాగిస్తున్నారు. దళితులను వ్యవసాయ పనులకు పిలవకపోవడమే కాక కౌలుకు సాగు చేస్తున్న భూములను కూడా అగ్రవర్ణ భూస్వాములు గుంజుకోవడంతో పేదలు ఉపాధి కోల్పోయారు. సాంఘిక బహిష్కరణ జరిగినపుడు దళితులకు ఇవ్వవలసిన పరిహారం, సహాయం అందించవలసింది పోయి ప్రభుత్వ యంత్రాంగం వారిపై నిర్బంధం ప్రయోగించడం శోచనీయం. జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌తో సహా ఎంతోమంది ప్రభుత్వ పెద్దలు గ్రామానికి వెళ్ళినప్పటికీ దళితులపై ఇప్పటికీ సాంఘిక బహిష్కరణ కొనసాగుతుండడం గమనార్హం.

ప్రకాశం జిల్లా పర్చూరు మండలం దేవరపల్లి గ్రామంలో తమ తాతల తండ్రుల కాలంనుండి దళితులు సాగు చేసుకుంటున్న భూములనుండి నీరు – చెట్టు పేరుతో వారిని వెళ్ళగొట్టడానికి స్థానిక పెత్తందార్లు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 1976లో దళితులకు ఆ భూమికి పట్టాలిచ్చింది. దళితుల భూములను సాగు చేసుకునే విషయంలో చట్టానికి వ్యతిరేకంగా జోక్యం చేసుకోవద్దని హైకోర్టు (17380/2015) ఆదేశించింది. అయినా పెత్తందార్లు దళితులను ఆ భూములనుండి వెళ్ళగొట్టడానికి ప్రయత్నించడం అన్యాయం. ఇదే రకమైన పరిస్థితి పర్చూరు నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో ఉన్నది.

పై రెండు ఘటనలలో దళితులపై అణిచివేతకు పాల్పడుతున్న అగ్రకుల పెత్తందార్లకు పోలీసులు, ప్రభుత్వ అధికారులు అండగా ఉంటున్నారు. సంఘీభావం తెలపడానికి వెళ్ళిన ప్రజాసంఘాలు, దళిత సంఘాలు, ప్రజాప్రతినిధులు, పార్టీల వారిని కూడా నిర్బంధిస్తున్నారు. దళితుల హక్కులకు భంగం కలిగిస్తున్నారు. కంచే చేను మేసిన విధంగా పోలీసులు దళితులపైనే కేసులు నమోదు చేస్తున్నారు. దోషులు యదేచ్ఛగా బయట తిరుగుతున్నారు. ఈ ఘటనల్లో ప్రభుత్వ చర్యలు దళితులను అవమానపరిచే విధంగానూ, అణచివేతకు మద్దతు తెలిపేవిగానూ ఉన్నాయి.

**వెంటనే మీరు జోక్యం చేసుకుని గరగపర్రు సాంఘిక బహిష్కరణ ఎత్తివేయించడం, బహిష్కరణకు పాల్పడిన అగ్రకుల పెత్తందార్లపైన, వారికి అండగా ఉన్న పోలీసులు, ఇతర అధికారులపైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. సాంఘిక బహిష్కరణకు గురైన వారికి ప్రభుత్వం ప్రకటించిన మరియు చట్టబద్ధంగా చేయాల్సిన సహాయక చర్యలు ప్రభుత్వం వెంటనే చేపట్టాలని కోరుతున్నాము.**

**దేవరపల్లిలో దళితులు సాగు చేసుకోవడానికి అడ్డంకులు తొలగించాలని, సాగుదారులను అడ్డుకుంటున్న పెత్తందార్లపై కేసులు నమోదు చేసి శిక్షించాలని కోరుతున్నాము. తప్పుడుకేసులు, నోటీసులు ఇస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.**

**అభివందనములతో...**

| | | | |
|---|---|---|---|
| **(కె.రామకృష్ణ)**<br>సిపిఐ | **(పి.మధు)**<br>సిపిఐ(యం) | **(వై.సాంబశివరావు)**<br>సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ | |
| **(గుర్రం విజయకుమార్)**<br>సిపిఐ(యంఎల్) | **(యం.వెంకటరెడ్డి)**<br>యంసిపిఐ(యు) | **(బి.బంగార్‌రావ్)**<br>సిపిఐ(యంఎల్)లిబరేషన్ | |
| **(చిట్టిపాటి వెంకటేశ్వర్లు)**<br>సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ | **(బి.ఎస్. అమర్‌నాథ్)**<br>యస్‌యుసిఐ(సి) | **(పి.వి.సుందరరామరాజు)**<br>ఫార్వర్డ్‌బ్లాక్ | **(జానకి రాములు)**<br>రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ |

**గమనిక : గరగపర్రు, దేవరపల్లి సమస్యలపై వాస్తవ విషయాలను మీ సమాచారం కోసం ఇందుతో జతపరుస్తున్నాము.**

**గరగపర్రు సమస్య :** పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం గరగపర్రులో డా॥ బి.ఆర్.అంబేద్కర్ 126వ జయంతి సందర్భంగా దళితులు అంబేద్కర్ విగ్రహం ఆ గ్రామ చెరువుగట్టు పైన అప్పటికే ఉన్న మహాత్మ గాంధీ, అల్లూరి సీతారామరాజు, సర్ ఆర్థర్ కాటన్, పొట్టి శ్రీరాములు, తాండ్ర పాపారాయుడు విగ్రహాల పక్కన ఆవిష్కరించారు. గ్రామ సర్పంచ్, ఎంపిటిసి ఇద్దరూ దళితులే. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటును సహించలేని ఆ గ్రామ అగ్రకుల పెత్తందార్లు విగ్రహ ఏర్పాటును సహించలేక అర్ధరాత్రి తొలగించారు. అంబేద్కర్ విగ్రహాన్ని ఎత్తుకుపోయి చెరువులో పడేశారు. తమ విగ్రహాన్ని తమకు ఇవ్వాలని ధర్నాతో ఆందోళన చేసిన దళితులపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేశారు. పెత్తందార్లు మే 6 నుండి ఆ గ్రామ దళితులను సాంఘిక బహిష్కరణకు గురి చేశారు. దళితులకు కౌలుకిచ్చిన భూములనుండి వెళ్ళగొట్టారు. వ్యవసాయ పనులు, ఇతర పనులకు పిలవకుండా నిషేధం విధించారు. కేబుల్ ఆపరేటర్, బిల్డింగ్ వర్కర్, ఎలక్ట్రికల్ వర్కర్, లారీ, ట్రాక్టర్ డ్రైవర్లను తొలగించారు. దళితులతో మాట్లాడినా, పనులకు పిలిచినా 1000 రూపాయిలు జరిమానా వేస్తామని నిర్ణయించారు. భూస్వాముల ఈ దురాగతం భీమవరానికి 6 కి॥మీ॥ సమీపంలో జరిగింది. భూములు, ఉపాధి కోల్పోయి దళితులకు పూట గడవక నరకయాతన అనుభవిస్తూ వచ్చారు.గత రెండున్నర నెలలుగా ఈ అనాగరిక సాంఘిక బహిష్కరణ కొనసాగుతూనే ఉంది. నాగరిక సమాజం ఈ అనాగరిక చర్యను ఖండించడం క్రమంగా పెరిగి పెద్దదైంది. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయక తప్పలేదు. సాంఘిక బహిష్కరణకు గురైన దళిత కుటుంబాలకు ఎస్సీ, ఎస్టీ చట్ట ప్రకారం రావల్సిన నష్టపరిహారం ఇస్తామని పది రోజుల క్రితం మంత్రులు, అధికారులు ప్రకటించినా ఇంతవరకూ అందలేదు. దళితుల నిరవధిక ఆందోళన ఫలితంగా నిందితులను అరెస్టు చేసినా సాంఘిక బహిష్కరణ మాత్రం తొలగలేదు. చట్ట వ్యతిరేకమైన సాంఘిక బహిష్కరణకు పాల్పడిన వారిపై కేసులు పెట్టి కఠినంగా శిక్షించాల్సిన పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం దళితులపైనే కేసులు పెట్టి భయానక వాతావరణం సృష్టించారు. వీరికి సంఘీభావంగా భీమవరంలో తలపెట్టిన సభలను నిషేధించి 144 సెక్షన్ విధించి పోలీసులతో దిగ్బంధనం చేసినా ప్రజలు ప్రతిఘటించారు. ప్రభుత్వం అగ్రకుల పెత్తందార్లకు మద్దతు ఇచ్చిన కారణంగానే దళితులపై సాంఘిక బహిష్కరణ ఇంతకాలం కొనసాగుతోంది.

**దేవరపల్లి సమస్య :** ప్రకాశం జిల్లా పర్చూరు మండలంలో దేవరపల్లి గ్రామంలో సర్వే నెం.159/1 లో 39 ఎకరాల 37 సెంట్లు "కృష్ణం రాజు కుంట" గా రికార్డులలో పేర్కొనబడింది. అయితే ఈ భూమిని అనేక దశాబ్దాల నుంచి ఆ గ్రామ దళితులు సాగు చేసుకొని జీవిస్తున్నారు. తాతల తండ్రుల కాలం నుంచి ఈ సాగు చేసుకొని అనుభవిస్తున్నారు. 1976లో ఈ భూమి సాగు చేసుకోవాలంటే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవాలని ప్రభుత్వం షరతులు విధించగా అనేక మంది దళితులు ఆ నియమాన్ని పాటించారు. కొందరు దళితులకి ప్రభుత్వ భూములు సాగు చేసుకోవటానికి 1976లో లిఖిత పూర్వక అనుమతి పత్రాలను కూడా ఇచ్చింది.

2000 సం॥లో చెరువు అభివృద్ధి చేయాలని నెపంతో దళితులను భూములనుండి ఖాళీ చేయించటానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈ విషయమై అప్పటి ఎమ్మార్వో, ఆర్డీవోలు 18-10-2000 న కలెక్టరుకి నివేదిక సమర్పించారు. ఆ నివేదిక ప్రకారం ఆ చెరువు మొత్తం 39.37 ఎకరాలు ఉండగా 24 ఎకరాలు 80 మంది చేత ఆక్రమించబడిందని, అందులో 40 మంది దళితులు కాగా మిగిలిన వారు ఇతరులు. సమస్య పరిష్కారం కోసం ఆర్డీవో రెండు సూచనలు చేశారు.

**(1) చెరువు ప్రాంతంగా ఉన్న 15.37 ఎకరాలను అభివృద్ధి చేయటానికి లక్ష రూపాయల నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయటం ద్వారా తాగు నీటి సమస్య లేకుండా చేయవచ్చు. (2) భూమిని సాగు చేసుకుంటున్న 80 మందిలో అర్హులను సాగు చేసుకోవటానికి అనుమతి ఇస్తూ అనర్హులను తొలగించి అవసరమైతే చెరువు భాగంలో దాన్ని కలపవచ్చు.**

ఈ నివేదిక 2000 సం॥లోనే సమర్పించినప్పటికి దానిమీద ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకోలేదు పైగా "సాయి రూరల్ డెవలప్ మెంట్ వాలంట్రీ ఆర్గనేజేషన్" పేరుతో హైకోర్టులో కేసులు దాఖలు చేశారు. రిట్ నెం.18894 /2001 కేసులో దళితులు కూడా పార్టీగా చేరి కోర్టుకి వాస్తవాలు తెలియజేసారు. ఆ గ్రామంలో తాగు నీటికి ఎటువంటి కొరత లేదని, నెదర్లాండ్ పథకం క్రింద తాగు నీరు అందించబడుతుందని, ఎమ్మార్వో వేసిన అఫిడవిట్‌లో పేర్కొన్నదాన్ని ఆధారం చేసుకుని ఆ కేసును 21-8-2002 న కొట్టి వేయడం జరిగింది. హైకోర్టు రిట్ నెం.17380/ 2015 ద్వారా చట్టానికి వ్యతిరేకంగా దళితులు భూమిని సాగు చేసుకునే విషయంలో జోక్యం చేసుకోవద్దని కోర్టు ఆదేశించింది. అనగా ఏదైనా జోక్యం చేసుకోవలసివస్తే చట్ట బద్ధంగా మాత్రమే జోక్యం చేసుకోవాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

14-9-2015న పర్చూరు తహశీల్దారు కె.రాజ్యలక్ష్మీ గారు హైకోర్టులో రిట్: నెం.17380/ 2015 కేసులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేస్తూ ఈ విధంగా చెప్పారు.

(1) **సర్వే నెం.1591 లో ఉన్న చెరువు గ్రామ పంచాయితీకి చెందినది. రెవిన్యూకి ఎటువంటి సంబంధం లేదు. అనగా ఆ చెరువుకి యజమాని గ్రామపంచాయితీ.**

(2) **ఆ చెరువు మొదటి నుండి కృష్ణం రాజు కుంటగా పేరుబడిన కుంట పోరంబోకు.**

(3) **ఆ చెరువు రికార్డులలో 39.3 ఎకరాలు ఉండగా, వాస్తవానికి చెరువుగా ఉన్నది కేవలం 10 ఎకరాలేనని మిగిలిన భూమంతా మైదానంగా ఉన్నది.**

(4) **1976నుండి ఆ భూమిలో వ్యవసాయం జరుగుతుందని అప్పటి తహశీల్దార్ ఆ భూమిని ఖాళీ చేయుటకు నోటీసుజారీ చేశారు.**

(5) **గ్రామ పంచాయితీ ఆ చెరువుని అభివృద్ధి చేయాలని తీర్మానించి సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించాలని గ్రామపంచాయితీ కోరిన మీదట రెవిన్యూ అధికారులు, సర్వేయర్లు ఆ భూమి వద్దకు వెళ్లారని అంతే తప్ప దళితులను తొలగించే ఉద్దేశ్యం రెవెన్యూ వారికి లేదని తెలిపారు.**

(6) **జి.వో.ఎం.ఎస్.నెం. 188 ద్వారా కేవలం గ్రామపంచాయితీకి మాత్రమే ఈ భూములపై ఉన్న ఆక్రమణలను తొలగించే అధికారం ఉందని స్పష్టంగా కోర్టుకి తెలియజేశారు.**

దళితుల భూములు ఖాళీ చేయించవద్దని హైకోర్టు తీర్పు ఉంది. 1976లోనే దళితులకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది. అయినా వారిని ఆ భూములనుండి వెళ్ళగొట్టడానికి అగ్రకుల పెత్తందార్లు చేస్తున్న ప్రయత్నాలకు పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం అండగా నిలుస్తున్నారు. దళితులను ఆ భూముల్లోకి వెళ్ళనివ్వకుండా 144 సెక్షన్ విధించి వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. వారికి సంఘీభావంగా వెళ్తున్న వారిని పోలీసులు అడ్డుకుని కేసులు పెడుతున్నారు.